డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 20 మందిపై కేసులు నమోదు

- నలుగురికి జైలుశిక్ష

వినాయక్‌నగర్, జనవరి 10 : జిల్లాకేంద్రంలో సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందిపై కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ ఇచ్చారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా కంఠేశ్వర్‌కు చెందిన ఎండీ. సలీం, వర్ని మండలానికి చెందిన ఎస్.సంతోష్, వినాయక్‌నగర్‌కు చెందిన బి.సంతోష్‌కు రెండు రోజుల చొప్పున, గంజ్ ప్రాంతానికి చెందిన కమల్‌సింగ్‌కు ఒక రోజు జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ నూర్జహాన్ తీర్పు వెల్లడించారు. మిగతా 16 మందికి రూ.25,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

రుద్రూర్, జనవరి 10 : మండలకేంద్రంలోని ఊర చెరువులో రుద్రూర్ గ్రామానికి చెందిన జూకంటి శారద (34) శుక్రవారం దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. శారద కడుపునొప్పితోపాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నది. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

ఆవుపై చిరుత దాడి

మోస్రా (చందూర్) , జనవరి 10 : మోస్రా మండలంలోని చింతకుంట గ్రామ అటవీ ప్రాంతంలో ఆవుపై చిరుత శుక్రవారం దాడి చేసింది. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పశువుల కాపరి నారాయణ తన ఆవులను అటవీ ప్రాంతంలోకి శుక్రవారం మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఓ ఆవుపై చిరుత దాడి చేసిందని, పెంపుడు కుక్కలు మొరగడంతో తాను తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డానని నారాయణ తెలిపాడు. గుట్టవైపు పశువులను తీసుకెళ్లవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ బీట్ ఆఫీసర్ హుస్సేన్ సూచించారు.

పతంగుల షాపులపై దాడులు

వినాయక్‌నగర్, జనవరి 10 : నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పతంగుల షాపులపై టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. షాపుల్లో 10 బెండళ్ల నిషేధిత చైనా మంజాను సీజ్ చేసి, షాపు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని రెండోటౌన్ ఎస్సై యాసిన్ అరాఫత్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రుద్రూర్, జనవరి 10 : వర్ని మండలం అఫందిఫారం అటవీ ప్రాంతంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అఫందిఫారం – చందూర్ రోడ్డులోని డంపింగ్‌యార్డు వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏండ్లు ఉంటుందని, మృతిచెంది సుమారు 25 రోజులు కావడంతో కుళ్లిపోయి ఉందని తెలిపారు. అఫందిఫారం గ్రామానికి చెందిన రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న ఖేల్ ఉత్సవ్

డిచ్‌పల్లి, జనవరి 10 : యువజన దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో టీయూలో నిర్వహిస్తున్న ఖేల్ ఉత్సవ్‌లో భాగంగా పోటీలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శుక్రవారం క్రికెట్, కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌పోటీలను నిర్వహించగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ సంఘటన మంత్రి రాజుసాగర్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, సభ్యుడు మోహన్, నాయకులు అశోక్, తరుణ్, నాగరాజు, సమీర్, అక్షయ్, లెనిన్, రాకేశ్, నవీన్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- జిల్లాకేంద్రంలోని బట్టల షాపు, మెడికల్‌లో చోరీ
- రూ.3.25 లక్షలు అపహరణ
- డిచ్‌పల్లిలోని జ్యువెల్లరీ షాపులో కిలో వెండి..

వినాయక్‌నగర్, జనవరి 10 : జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రెండు దుకాణాల షట్టర్లను ధ్వంసం చేసి, నగదును చోరీ చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పూసాలగల్లీలో ఉన్న అరుణ ఫ్యాబ్రిక్ వస్త్ర దుకాణంలోకి తెల్లవారుజామున సుమారు 4 గంటలకు దుండగులు చొరబడి షాపులో ఉంచిన రూ.2.40 లక్షల నగదురు దోచుకుపోయారు. ఖిలీల్‌వాడిలో సుమారు తెల్లవారుజామున 4.30 గంటలకు ఎస్ఎస్ఎస్ జనరిక్ మెడికల్ షాపులో చొరబడి కౌంటర్‌లో ఉంచిన రూ.85 వేల నగదు ఎత్తుకుపోయారు. ఉదయం షాపులు తెరిచేందుకు వచ్చిన యజమానులు చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాలను ఎస్‌హెచ్‌వో సిబ్బందితో కలిసి పరిశీలించారు. దుండగులు ముఖాలకు ముసుగులు ధరించి వచ్చినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బట్టల దుకాణంలో వివరాలను సేకరిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లిలో బంగారం షాపులో చోరీ

డిచ్‌పల్లి, జనవరి10 : మండలకేంద్రంలోని హేమశ్రీ సిల్వర్ మర్చంట్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఎండీ షరీఫ్ కథనం ప్రకారం.. మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న షాపును యజమాని శ్రీరాముల లక్ష్మీనర్సయ్య ఎప్పటిలాగే గురువారం రాత్రి షట్టర్‌కు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం దుకాణానికి వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. షాపులోని సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను పరిశీలించగా ధ్వంసం చేయబడి ఉన్నది. దుండగులు షాపులోని అద్దాలను పగులగొట్టి కిలో వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బంగారు ఆభరణాలు దాచి ఉంచిన లాకర్ పగులగొట్టడంలో విఫలయత్నం అయ్యారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు ఎస్సై షరీఫ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. ప్రధానరోడ్డుపై 24 గంటలపాటు రాకపోకలు సాగుతున్నా చోరీ జరగడం కలకలం రేపింది. రెండు రోజుల క్రితం మండలకేంద్రంలోని మెకానిక్ షాపు నుంచి రెండు పల్సర్ బైక్‌ల చోరీ ఘటన మరకవముందే భారీ చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలి

- ప్రిన్సిపాళ్ల సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

ఖిలీల్‌వాడి, జనవరి 10 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని, ఇందుకు తగిన విధంగా సన్నద్ధం కావాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ ఆదేశించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు 90 రోజుల ప్రణాళికను తప్పకుండా అమలుచేయాలని ఆదేశించారు. ప్రాక్టికల్ పరీక్షలకు ప్రయోగశాలలను సిద్ధం చేయాలని, ప్రతి కళాశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

కంప్యూటర్లను అందజేస్తున్న ఎస్అండ్‌పీ గ్లోబల్ ప్రతినిధులు

ఇందల్వాయి, జనవరి 10 : మండలంలోని గన్నారం ప్రభుత్వ పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన ఎస్అండ్‌పీ గ్లోబల్ సంస్థ రూ.1,50,000 విలువ చేసే ఏడు కంప్యూటర్లు, ఒక ప్రొజెక్టర్ శుక్రవారం వితరణ చేశారు. తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో వీటిని వితరణ చేసినట్లు సంస్థ ప్రతినిధి కుంట రాజా రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వరప్రసాద్, మునీందర్, మోహన్‌రెడ్డి, భైరయ్య, కిరణ్, కేపీ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద ట్రిప్పుల ఇసుక సీజ్

పోతంగల్, జనవరి 10 : మండలంలోని మంజీరా పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. పోతంగల్ రెండో బ్రిడ్జి వద్ద శుక్రవారం సుమారు 100 ట్రిప్పులకు పైగా ఇసుక డంపులను గుర్తించి, సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ సురేందర్ నాయక్ వెల్లడించారు. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఇసుక మాఫియా తన పని తాను చేసుకుంటూ జోరుగా ఇసుక దందా కొనసాగిస్తున్నది.

సీజ్ చేసిన ఇసుక డంపులను చూపుతున్న రెవెన్యూ అధికారి

మత్తుపదార్థాల సరఫరాను అరికట్టాలి

డిచ్‌పల్లి, జనవరి 10 : యువత మత్తుపదార్థాల బారిన పడకుండా మండలంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల సరఫరాను నియంత్రించాలని డిచ్‌పల్లి ఎస్సైకి సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి బి.మురళి మాట్లాడుతూ... కళాశాలల సమీపంలో, మారుమూల గ్రామాల శివారుల్లో మత్తు పదార్థాలను విరివిగా విక్రయిస్తున్నారని, దీంతో యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి నేరాలు చేసేందుకు కూడా వెనుకాడడం లేదని పేర్కొన్నారు. పోలీసులు మత్తు పదార్థాల సరఫరాలపై నిఘా పెట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్, నాయకులు సాయిబాబా, మోహన్, శ్రీరాము, రాజేశ్, బన్నీ పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

నిత్యశ్రీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జక్రాన్‌పల్లి, జనవరి 10 : మహారాష్ట్రలోని జల్గావ్‌లో ఉన్న ఛత్రపతి శివాజీస్టేడియంలో ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తొర్లికొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సాంబార్ నిత్యశ్రీ ప్రతిభ చూపి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. కాంస్య పతకం అందుకుని పాఠశాలకు వచ్చిన సందర్భంగా నిత్యశ్రీ తోపాటు జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్‌ను హెచ్ఎం, ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు స్వాగతం పలికి సన్మానించారు. ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, గంగాధర్, డాక్టర్ నర్సింహారావు, కృష్ణ, మాలతి, గంగాధర్, గౌతమి, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి

వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోస్రా (చందూర్), జనవరి 10 : మోస్రా మండలంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని, బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారుల నుంచి బిల్లులు ఇప్పిస్తానని జీపీ కారోబార్ రూ.6,500 చొప్పున వసూలు చేశాడని, ఏడాది కావస్తున్నా బిల్లులు రాలేవని పేర్కొన్నారు. లబ్ధిదారుల డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పసుల ప్రశాంత్ రెడ్డి, విజయ్, గణేశ్, అలీం, అనీస్, రాము, సాయాగౌడ్ లక్ష్మణ్, నరేందర్, నర్సయ్య, అఫ్సర్, అర్షాద్, సికిందర్, భూమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. అక్రమంగా డబ్బులు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్‌నాయకులు ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు.

ఫార్మాస్యూటికల్ విభాగంలో గణేశ్‌బాబుకు డాక్టరేట్

గణేశ్ బాబు

డిచ్‌పల్లి, జనవరి 10 : టీయూలోని ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధక విద్యార్థి బాతుల గణేశ్ బాబు పీహెచ్‌డీ సాధించారు. అసోసియేట్ ప్రొఫెసర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'ప్రిపరేషన్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ నానోస్ట్రక్చర్డ్ మిక్స్‌డ్ మెటల్ ఆక్సైడ్ క్యాటలిస్ట్ ఫర్ ఏరోబిక్ యాక్సిడేషన్ ఆఫ్ ఆల్కహాల్స్ అండ్ కండెన్స్ ఆఫ్ ఆడేయిడ్స్' అంశంపై గణేశ్‌బాబు పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. టీయూలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ అశోక్ ఎక్స్ టర్నల్ ఎగ్జామినర్‌గా హాజరై పరిశోధకుడిని పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వాసం చంద్రశేఖర్, సైన్స్ డీన్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, కంట్రోలర్ ప్రొఫెసర్ .అరుణ, అధ్యాపకులు బోయపాటి శిరీష, పర్యవేక్షకులు సత్యనారాయణరెడ్డి, ప్రసన్నశీల, కాంట్రాక్టు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్‌లో స్వచ్ఛభారత్

శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

డిచ్‌పల్లి, జనవరి 10 : టీయూ క్యాంపస్ ఆవరణలో కామారెడ్డి ఆర్‌కే డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిపాలనా భవనం, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజ్, బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, పరిసరాలు శుభ్రం చేశారు. వలంటీర్లను వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అభినందించారు. కార్యక్రమంలో టీయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, ఆర్‌కే డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ సీఈవో జైపాల్‌రెడ్డి, డీన్ నవీన్‌కుమార్, కోఆర్డినేటర్ దత్తాద్రి, ప్రిన్సిపాళ్లు సైదయ్య, గోవర్ధన్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హత్య, చోరీ కేసులను చేధించిన పోలీసులు

మాట్లాడుతున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌టౌన్, జనవరి10: హత్య, చోరీ కేసును పోలీసులు చేధించారు. వివరాలను పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ సీపీ బస్వారెడ్డి శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 8న రాత్రి మామిడిపల్లిలోని గోవిందేపేట్ ఎక్స్ రోడ్డు వద్ద ఓ వైన్ షాపులో జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక కారు, రెండు పల్సర్ బైకులు, రెండు వేల రూపాయల నగదు, ఒక రాయల్ స్టాగ్ విస్కీ బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో గురువారం ఉదయం జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. తెలిపారు. ఈ కేసులను చేధించిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సై గోవింద్, మహేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ నమోదు పూర్తి చేయాలి

సూచనలు చేస్తున్న జిల్లా విద్యాధికారి అశోక్

బోధన్, జనవరి 10: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఈనెల 25వ తేదీ లోగా అపార్ (అటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రి)ని పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ సూచించారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఉప విద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో డీఈవో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకార పత్రంతో ఆధార్ కార్డులో, పాఠశాల రికార్డుల్లో పుట్టిన తేదీ, తల్లి తండ్రి పేర్లు మొదలైన వివరాలు సరిచూసుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకుచ్చిన అపార్ సంఖ్యను అన్ని పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్తులో అపార్ ద్వారానే ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు, కళాశాలలకు ఆన్‌లైన్ ద్వారా వివరాలు ట్రాన్స్‌ఫర్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అపార్ నమోదులో జిల్లా వెనుకబడి ఉందని, ఇప్పటికైనా జాప్యం లేకుండా నమోదు పూర్తి చేయాలని డీఈవో సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఎంఈవో నాగయ్య, సీఆర్పీలు విజయ్, యూసుఫ్, రేఖ, విజయ, శివానంద్, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, కరెస్పాండెంట్లు కొడాలి కిశోర్, హరికృష్ణ, శ్రీనివాస్, ఐఆర్ చక్రవర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తాతలు, నానమ్మలు, అమ్మలను సన్మానిస్తున్న విద్యార్థులు

బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి హైస్కూల్‌లో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్‌డే నిర్వహించారు. హైస్కూల్‌కు చెందిన హాస్టల్ విద్యార్థుల తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు సుమారు 150 మంది రాగా వారిని పిల్లలు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం వారి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. గ్రాండ్ పేరెంట్స్‌డేకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ప్రవచన కర్త జగన్ గురూజీ ప్రవచనం ఇచ్చారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి పాల్గొన్నారు. – బోధన్, జనవరి 10

మాట్లాడుతున్న ప్రవచనకర్త జగన్ గురూజీ

ఉప్లూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కందకుర్తి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

మోర్తాడ్/రెంజల్/మాక్లూర్/పొతంగల్, జనవరి 10: కమ్మర్‌పల్లి, మోర్తాడ్,రెంజల్, మాక్లూర్ తదితర మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. రెంజల్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గులు, పంతగుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలురుకు గాలిపటాల పోటీలు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పొతంగల్ జడ్పీహెచ్ఎస్‌లో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎత్తొండ విండోకు రూ.9 కోట్ల నష్టం

- సర్వసభ్య సమావేశంలో రిజిస్టర్ల వెల్లడి
- నష్టానికి పాలకవర్గమే బాధ్యత వహించాలని సభ్యుల తీర్మానం

కోటగిరి, జనవరి 10: ఎత్తొండ సహకార సంఘం జరిగిన నష్టానికి పాలక వర్గమే బాధ్యత వహించాలని సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఎత్తొండ సహకార సంఘం ఆవరణలో ఇన్‌చార్జి చైర్మన్ రామదాసు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘంలో జరిగిన లావాదేవీలపై రిజిస్టర్స్ పుష్పు, రియాజ్ విచారణ నివేదికను చదివి వినిపించారు. సంఘంలో 400 మంది సభ్యులు ఉండగా..ఏడాదికి రూ.20 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి రికార్డులు, రైస్ మిల్లుల్లో ధాన్యం క్రయ, విక్రయాలు, కిరాణా షాపు, ఎరువుల దుకాణాల నిర్వహణలో నిర్లక్ష్యంతో రూ.9కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. దీంతో సంఘ సభ్యులు రెండు పర్యాయాలు ఉన్న పాలకవర్గం నుంచి ఇప్పటి వరకు సంఘానికి సంబంధించిన లావాదేవీలపై పూర్తి విచారణ చేపట్టాలని తీర్మానం చేశారు. జరిగిన నష్టానికి పాలకవర్గమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పుస్తకాల బహూకరణ

బాల్కొండ, జనవరి 10: కవి, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు మహేశ్‌బాబు మండలంలోని చిట్టాపూర్ పాఠశాలకు తెలుగు కాంప్లెక్స్ భాష ఉపాధ్యాయులకు తాను రచించిన తెలుగు వాణి, పొడుపు విడుపు, అమృత వర్షిణి పుస్తకాలను బహూకరించారు. ఆయన సంపాదకత్వంలో వెలువడిన తెలంగాణ శతకం తదితర పుస్తకాలను 100 విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, జనవరి10: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం సభ్యులు విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. సమస్యలు ఎదురైతే క్యూఆర్ కోడ్ ఉపయోగించి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు వరి సాగుపై అవగాహన

వేల్పూర్, జనవరి 10: మండలంలోని మోతె రైతువేదికలో శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వరిలో తడి, పొడి పద్ధతిలో సాగు విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో షబ్బీర్, డాక్టర్ రెడ్డి, చింత శ్రీనివాస్, సునుత్న, మహేందర్ పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి

శక్కర్‌నగర్, జనవరి 10: రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని బోధన ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం బోధన్ శివారులోని ఇందూర్ హైస్కూల్‌లో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసుశాఖ, మోటరు వాహనాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు చేశారు. ఎంవీఐ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మానవ తప్పిదాలతో ఏటా లక్షలాది మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే జైలుశిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తారని అన్నారు. కార్యక్రమంలో బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, పాఠశాల కరెస్పాండెంట్ కొడాలి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎడపల్లి, జనవరి 10: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటల పాటు విద్యుత్ సర